సాక్షి
మెదక్
మంగళవారం : 28 : మే : 2024



మేలైన విత్తనం.. నాటుదాం

మేలైన విత్తనాలంటే రైతులందరికీ ఇష్టమే. పంట బాగా పండి అధిక దిగుబడిని సాధించవచ్చు. చీడపీడల ప్రభావం ఉండదు.

వివరాలు 8లో ▸



భారీ అగ్నిప్రమాదం

జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.

వివరాలు 8లో ▸



బిల్లు భద్రపరుచుకోవాలి

రైతులు విత్తనాలు కొనుగోలు చేయగానే బిల్లు తీసుకోవడంతోపాటు విత్తన ప్యాకెట్‌ను పంట పూర్తి అయ్యేవరకు జాగ్రత్త చేసుకోవాలని ఏడీఏ పుణ్యవతి తెలిపారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గోవింద్



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గోవింద్

అల్లాదుర్గం(మెదక్): రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని ముస్లాపూర్ రైతువేదికలో రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గం విత్తన డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వ్యవసాయశాఖ అధికారులు రాజేశ్, రాంప్రసాద్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

వర్మి కంపోస్టు తయారీపై సంతృప్తి



మొక్కలను పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

రామాయంపేట(మెదక్): పంచాయతీ ఆస్తుల తనిఖీలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఆర్‌వెంకటాపూర్‌ను సందర్శించారు. సోమవారం ఆయన డంప్‌యార్డుతో పాటు నర్సరీ, క్రీడా మైదానం, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామంను పరిశీలించారు. డంప్‌యార్డులో చెత్తతో తయారవుతున్న వర్మి కంపోస్టును పరిశీలించి గ్రామ కార్యదర్శి శ్యామలను ప్రశంసించారు. నర్సరీలో వంద శాతం మొక్కలను కాపాడామని ఆమె డీపీఓకు వివరించారు. పంచాయతీ లేబుల్‌తో తయారు చేసిన బ్యాగులో వర్మి కంపోస్టును, మొక్కను కార్యదర్శి డీపీఓకు అందజేశారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి గిరిజారాణి ఉన్నారు.

యునిఫాంలు నాణ్యతగా ఉండాలి

డీఆర్‌డీఓ శ్రీనివాసరావు



యునిఫాంలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కౌడిపల్లి(నర్సాపూర్): యునిఫాంలు నాణ్యతగా ఉండాలని డీఆర్‌డీఓ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం కౌడిపల్లి, భుజిరంపేట గ్రామాలలో డ్వాక్రా సంఘం టైలర్లు కుడుతున్న విద్యార్థుల యునిఫాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఎవరైనా మహిళా సంఘం సభ్యులు ముందుకువస్తే కుట్టేందుకు మెటీరియల్ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠశాలల ప్రారంభం నాటికి యునిఫాంలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కూకుట్లపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి లారీల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరోతరగతితో పాటు ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఎస్‌ఓ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోతరగతి ఇంటర్‌లో సీఈసీ, మల్టీపర్పస్‌హెల్త్ వర్కర్ కోర్సులో చేరేందుకు ప్రవేశాల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. ఆరో తరగతిలో చేరడానికి ఐదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్‌లో చేరేందుకు పదోతరగతి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 1లోగా తమ దరఖాస్తులను పాఠశాలలో అందించాలని ఎస్‌ఓ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురికి ప్రభుత్వం పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు అందించనున్నట్లు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశిష్ట సేవలు అందించిన వారు అవార్డ్స్.జీఓవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మూడు సెట్లను 3వ తేదీలోగా సమీకృత కలెక్టరేట్‌లోని యువ జన క్రీడలశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంపికైన వారికి ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో అవార్డులు అందజేస్తారని చెప్పారు. వివరాల కోసం 93473 44440లో సంప్రదించాలని సూచించారు.

మా డీడీలు మాకివ్వండి

కలెక్టరేట్‌కు గొల్లకురుమల తాకిడి

- రెండో విడతలో 2,584మంది చెల్లించగా.. 642 మందికే జీవాల అప్పగింత
- ఇంకా మిగిలిన బాధితుల సంఖ్య 1,942

రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా వేలాది మంది గొల్లకురుమలు డీడీలు చెల్లించారు. రెండేళ్ల సమయం గడిచి పోయినా వారికి జీవాలు అందించడం లేదు. ఎన్నోసార్లు కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో విసుగెత్తిన గొల్లకురుమలు తమ డీడీలు తమ కివ్వాలంటూ కలెక్టరేట్‌లో అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం మారిన ఈ నేపథ్యంలో అసలు పథకం కొనసాగుతుందో లేదో తెలియని పరిస్థితి. – మెదక్‌జోన్



డీడీల కోసం దరఖాస్తు చేస్తున్న గొల్లకురుమలు

జిల్లాలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో గొల్ల కురుమల అభివృద్ధి కోసం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా వ్యాప్తంగా 22వేల మంది గొల్ల కురుమలను గుర్తించిన అధికారులు మొదటి విడతలో భాగంగా 13,766 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి 20 గొర్రెలు 1విత్తనం పొటేల్‌కు రూ.1.25లక్షలు యూనిట్ ధర నిర్ణయించారు. 75శాతం సబ్సిడీ కింద రూ.93,750 ప్రభుత్వం చెల్లించగా మిగతా 25శాతం లబ్ధిదారుడి వాటా కింద రూ.31,250 తీసుకున్నారు. మొదటి విడతలో ఎలాంటి అవకతవకలు లేకుండా ఈ పథకం సాఫీగా కొనసాగింది.

ముందుకు సాగని రెండో విడత

రెండోవిడత పంపిణీని 2022లో ప్రారంభించారు. మొదటి విడతతో పోల్చుకుంటే రెండో విడతలో గొర్రెల యూనిట్‌ధర పెరిగింది. మొదటి విడత రూ.1.25లక్షలు ఉండగా రెండో విడత యూనిట్ ధర రూ.1.75 లక్షలకు చేరింది. అంటే యూనిట్‌కు రూ.50వేలు అదనంగా భారం పడింది. అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా 2,584 మంది గొర్రెల కాపరులు రూ.43,750 చొప్పున డీడీలుతీసి సంబంధిత వెటర్నరీశాఖ అధికారులకు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 642 మందికి మాత్రమే గొర్రెలు అందజేశారు. ఇంకా 1,942 మందికి ఇవ్వాల్సి ఉంది. వారు డీడీలు చెల్లించి సుమారు రెండేళ్లయింది. ఈ లోగా ప్రభుత్వం మారడం, అసలు గొర్రెల పథకం గురించి ప్రస్తావనం లేకపోవడంతో తమ డీడీలు తమకివ్వాలని బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు అర్జీలు పెట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు 522మంది వెటర్నరీశాఖ అధికారులకు అర్జీలు పెట్టుకున్నారు.

డీడీలు తిరిగి చెల్లిస్తాం..

రెండో విడతలో లబ్ధిదారుల వాటాగా 2,584మంది డీడీలు చెల్లించగా 642 మందికి అసెంబ్లీ ఎన్నికల ముందు గొర్రెలు అందించాం. ఇంకా 1,942 మందికి ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. డీడీలు ఇవ్వాలని కోరిన వారికి త్వరలోనే చెల్లిస్తాం

– వెంకటయ్య, వెటర్నరీ అధికారి మెదక్

పకడ్బందీగా కౌంటింగ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మెదక్ పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేశామని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపడతామని ఎన్నికల జిల్లా అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ చీఫ్‌ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్ రాజ్, అడిషనల్ సీఈఓ డీఎస్ లోకేశ్ కుమార్, జాయింట్ సీఈఓ సరఫ్‌రాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవోలు అబ్దుల్ హమీద్, బి.హరిసింగ్‌తో కలిసి సదస్సుకు హాజరయ్యారు. కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నియమాలను తప్పనిసరిగా పాటించి కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్‌కు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మశ్రీ ఆర్డీఓ రమాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

రామాయంపేట(మెదక్): వారం రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పష్టం చేశారు. మండలంలోని రాయిలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 2.45లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, గత ఏడాది కంటే 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా సేకరించామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల మొలకలెత్తిన ధాన్యాన్ని లోకల్ రైసుమిల్లులకు తరలించామని చెప్పారు. కలెక్టర్ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతాన్ని చూశారు. స్థానిక తహసీల్దార్ రజనీ కుమారి, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ ఆయన వెంట ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఆర్‌ఓ పద్మశ్రీ, ఆర్డీఓ రమాదేవి

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

రామాయంపేట(మెదక్): స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం ఆయన దామరచెరువు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా బడులను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రజనీకుమారి, ఎంఈవో నీలకంఠం ఉన్నారు.

వృద్ధులకు ఉచితంగా బీసీజీ వ్యాక్సినేషన్

వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో బీసీజీ వ్యాక్సినేషన్‌కు అవసరమైన కార్యాచరణ చురుగ్గా సాగుతోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో వైద్య అధికారులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 60 యేళ్లు పైబడిన వారికి ఉచితంగా బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటికే వివిధ స్థాయిలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలు, వ్యాక్సినేషన్ కేంద్రాలలో వ్యాక్సిన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ టీబీ కోఆర్డినేటర్ డాక్టర్ భాను, రాజేంద్ర ప్రసాద్, స్నేహ శుక్ల, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు విజయనిర్మల, అనిల, అరుణశ్రీ, మాధురి, జిల్లా ఎమినైజేషన్ అధికారి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామ్



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

డబుల్‌బెడ్రూం కబ్జాపై ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: తనకు మంజూరైన డబుల్‌బెడ్రూంను ఇతరులు కబ్జా చేశారని, ఖాళీ చేయమంటే దౌర్జన్యం చేస్తున్నారని జిల్లా ఎస్పీ బాలస్వామికి ఓ బాధితురాలు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ బాలస్వామి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన మహాల్దార్ గాయత్రి తమకు కేటాయించిన డబుల్ బెడ్రూంను వేరేవాళ్ళు కబ్జా చేశారని, ఖాళీచేసి ఇవ్వమని అడిగితే తనపై దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం ఆమెకు న్యాయం చేయాలని ఎస్పీ తూప్రాన్ ఎస్ఐకు సూచించారు. అలాగే హవేళి ఘణాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి నిర్మల తన భర్త మృతికి కారణమైన వారిపై చర్య తీసుకుని, తనకు ఇన్సూరెన్స్ ఇప్పించాలని ఫిర్యాదు చేశారు.

రైతులు అధైర్య పడొద్దు



ధాన్యంలో తేమశాతం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- చివరి గింజ వరకు కొంటాం
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు అధైర్య పడవద్దని వరిధాన్యం చివరిగింజ వరకు కొంటామని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు వేరువేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లారీల సమస్యను పరిష్కరించేందుకు ఇతర జిల్లాల నుంచి వాహనాలు తెప్పిస్తున్నామని, అదేవిధంగా ఇతర జిల్లాలకు ధాన్యం తరలిస్తున్నామని చెప్పారు. నిర్వాహకులు తేమశాతం సరిగా చూసి కొనుగోలు చేయాలని చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈనెలాఖరు నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర నేత బుర్రప్రసాద్

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కేవలం కిషన్ భవన్‌లో జరిగిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలతో ప్రాణాలు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లేశం, నర్సమ్మ, మహేందర్‌రెడ్డి, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

రూ. 341 కోట్లు చెల్లించండి!

- గూడెం మధు అక్రమ మైనింగ్ లెక్కతేల్చిన గనుల శాఖ
- సంతోష్ గ్రానైట్ కంపెనీకి నోటీసులు
- క్వారీలో 72.87 లక్షల మెట్రిక్ టన్నుల మెటల్ తవ్వకాలు
- సీనరేజీ చెల్లించింది 8.48 లక్షల మెట్రిక్ టన్నులకే
- భారీ మొత్తంలో గనులశాఖకు ఎగవేసినట్లు గుర్తింపు



సంతోష్ గ్రానైట్ క్వారీని సీజ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి అక్రమ మైనింగ్ దందా లెక్క తేలింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలతో ఎగవేసిన సీనరేజీ, అందుకు జరిమానాలు అన్నీ కలిపి రూ.341.25 కోట్లు చెల్లించాలని మధుసూదన్‌రెడ్డికి చెందిన సంతోష్ గ్రానైట్, సాండ్ సప్లయ్ కంపెనీకి భూగర్భ గనులశాఖ నోటీసులు జారీ చేసింది. మధుసూదన్‌రెడ్డి పటాన్‌చెరు మండలం లక్డారంలోని సర్వే నెం.738లో 4.23 హెక్టార్లలో భూమిని లీజుకు తీసుకున్నారు. ఈ క్వారీలో అనుమతికి మించి తవ్వకాలు చేపట్టారు. నిర్ణీత సరిహద్దులను దాటి విచ్చలవిడిగా తోడేశారు. రాజకీయ అండదండలతో అడ్డూ అదుపు లేకుండా ఏళ్ల తరబడి ఈ అక్రమ మైనింగ్ దందా కొనసాగింది.

అక్రమాల లెక్క ఇది..

మధుసూదన్‌రెడ్డి భూగర్భగనుల శాఖకు చెల్లించాల్సిన సీనరేజీని రూ.కోట్లలో ఎగవేసినట్లు భూగర్భ గనులశాఖ గుర్తించింది. ఈ క్వారీలో మొత్తం 72.87 లక్షల మెట్రిక్ టన్నుల మెటల్‌ను తవ్వేసినట్లు నిర్ధారణకు వచ్చారు. కానీ సీనరేజీ మాత్రం కేవలం 8.48 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే చెల్లించారు. ఈ క్వారీకి ఇచ్చిన సరిహద్దుల్లో అనుమతికి మించి తవ్వకాలు జరపడంతో పాటు, సరిహద్దులు దాటి జరిపిన తవ్వకాలు సాగించినట్లు తేలింది. ఇలా రెండు రకాలు అక్రమ మైనింగ్‌కు పాల్పడినందుకు ఎగవేసిన సీనరేజీ, దానిపై జరిమానాలతో కలిపి మొత్తం రూ.341.28 కోట్లు చెల్లించాలని మైనింగ్‌శాఖ మధుసూదన్‌రెడ్డిని ఇటీవల నోటీసులు ఇచ్చింది. ఈ మొత్తాన్ని తమ శాఖకు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొంది.

టాస్క్‌ఫోర్స్ కమిటీ విచారణ

జిల్లాలో విచ్చలవిడిగా సాగిన ఈ మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం ఎట్టకేలకు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. మైనింగ్‌శాఖతో పాటు, పోలీసు, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డుల శాఖల ఉన్నతాధికారులతో కలిసి డిస్ట్రిక్ట్ లెవల్ టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించింది. ఆర్డీఓ నేతృత్వంలోని ఈ కమిటీలో మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, డీఎస్పీ, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డు ఏడీ, పీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్‌లతో కూడిన ఈ బృందం ఇటీవల క్వారీల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఇందులో భాగంగా సంతోష్ గ్రానైట్, సాండ్ సప్లయ్ కంపెనీ క్వారీలో విచారణ చేపట్టగా భారీ ఎత్తున అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

ఓపెన్ కాస్ట్ గనులను తలపించే విధంగా..

మధుసూదన్‌రెడ్డికి సంబంధించిన ఈ క్వారీని పరిశీలిస్తే సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో అక్రమ తవ్వకాలు జరిగాయంటే ఏ స్థాయిలో ఖనిజ సంపద దోపిడీకి గురైందో అర్థం చేసుకోవచ్చు. డిటోనేటర్లు వంటి పేలుడు పదార్థాలు, జేసీబీ, భారీ ప్రొక్లెయినర్లతో రాత్రీపగలు తేడా లేకుండా ఏండ్ల తరబడి అక్రమ తవ్వకాలు జరపడంతో ఈ క్వారీల్లో పెద్ద పెద్ద అగాదాలు ఏర్పడ్డాయి. పూడ్చలేని స్థాయిలో పర్యావరణం దెబ్బతిన్నది. ఈ క్వారీలో అనుమతించిన విస్తీర్ణం, తవ్వకాలు జరిగిన విస్తీర్ణం, అనుమతించిన లోతు, తవ్విన లోతు.. ఇలా అన్ని కోణాల్లో లెక్కించిన అధికారులు ఈ మేరకు భారీ ఎత్తున టన్నుల ఖనిజ సంపదను లూటీ చేసినట్లు గుర్తించారు. దోపిడీకి గురైన సంపదకు సంబంధించి ఎగవేసిన సీనరేజీ, జరిమానాలు అన్నీ కలిపి రూ.341.28 కోట్లు చెల్లించాలని సంతోష్ గ్రానైట్, సాండ్ సప్లయ్ కంపెనీకి నోటీసులు జారీ అయ్యాయి.

నోటీసులు ఇచ్చాం


సంతోష్ గ్రానైట్, సాండ్ సప్లయ్ కంపెనీకి సంబంధించి పటాన్‌చెరు మండలం లక్డారంలోని క్వారీలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయింది. వీటికి సంబంధించి సదరు కంపెనీకి నోటీసులు జారీ చేశాం. ఎగవేసిన సీనరేజీ, దానిపై పెనాల్టీతో కలిపి రూ.341.28 కోట్లు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నాం. దీనిపై సదరు కంపెనీ కోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో మా శాఖ ముందుకెళ్తుంది. – రఘుబాబు, అసిస్టెంట్ డైరెక్టర్, భూగర్భ గనుల శాఖ

41 బాల్య వివాహాలు అడ్డుకున్నాం

ఈఆర్‌ఎస్‌తో దివ్యాంగులకు ఉపాధి

- అంగన్‌వాడీలో 296 పోస్టులు ఖాళీ
- మరో 70మందికి రిటైర్మెంట్
- జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ

జిల్లాలో ఏడాది కాలంగా 41 బాల్య వివాహాలను అడ్డుకొని రెండు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చామని, బాలికలకు పెళ్లిచేసేందుకు యత్నించిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. సోమవారం ఆమె సాక్షితో మాట్లాడారు. –మెదక్ కలెక్టరేట్



జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ

జిల్లాలోని గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 41 బాల్య వివాహాలను అడ్డుకొని రెండు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే బాలికలకు సఖి సెంటర్‌లో 5రోజుల వరకు కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. 15 యేళ్లలోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని నిర్ణయించిన 8మందిపై కేసులు పెట్టినట్లు తెలిపారు. జిల్లాలోని కౌడిపల్లి, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఎన్నిసార్లు అవగాహన కల్పించినప్పటికీ బాలికల తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదని వాపోయారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబాల పరిస్థితుల కారణంగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 21 బాల్య వివాహాలు అడ్డుకున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలో 366పోస్టులు ఖాళీ

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం 296 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో మరో 70మంది రిటైర్మెంట్ పొందనున్నట్లు తెలిపారు. జిల్లాలో1076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా టీచర్లు, హెల్పర్లు 2152 ఉండాల్సి ఉందన్నారు. 191 మినీ అంగన్‌వాడీలను రెగ్యులర్‌గా మార్చడంతో హెల్పర్ పోస్టుల కూడా ఖాళీలు ఏర్పడినట్లు తెలిపారు. ప్రస్తుతం 30టీచర్ పోస్టులు, 266 హెల్పర్ పోస్టులు ఖాళీ అయినట్లు చెప్పారు. జిల్లాలో 65యేళ్లు నిండిన టీచర్లు 13 మంది, 57 మంది హెల్పర్లు మొత్తం 70 మంది ఉన్నట్లు వివరించారు. రిటైర్మెంట్ పొందే టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేలు ఇస్తారన్నారు. జిల్లాలో ఉన్న 1076 అంగన్‌వాడీల్లో 353 సొంత భవనాలు, 325 అద్దె భవనాలు, 398 ఫ్రీ బిల్డింగ్స్ ఉన్నట్లు వివరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని బ్రహ్మాజీ వెల్లడించారు.

స్వయం ఉపాధి రుణాలు

జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు ఎకనామిక్ రిఅప్లైడ్‌స్కీం (ఈఆర్‌ఎస్) పథకం కింద స్వయం ఉపాధి కోసం రుణాలు మండలానికి ఒకరికి చొప్పున రూ.50వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రుణం తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గత ఏడాది జిల్లాలోని హవేళిఘణాపూర్, నిజాంపేట, మెదక్, చిలిపిచెడ్, చిన్నశంకరంపేట, పాపన్నపేట, మనోహరబాద్, అల్లాదుర్గం మండలాల్లోని దివ్యాంగులకు స్వయం ఉపాధి రుణాలు అందజేశామని, మున్సిపాలిటీ పరిధిలోని దివ్యాంగులకు లక్ష నుండి 3లక్షల వరకు రుణాలు అందజేశామని చెప్పారు. 80శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. జిల్లాలో 4 మున్సిపాలిటీలు ఉండగా దివ్యాంగులు స్వయం ఉపాధి కోసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని చెప్పారు.

అవసరమైన వారికి యంత్రాలు

జిల్లాలో 38876 మంది వయోవృద్ధులు, 8433 మంది దివ్యాంగులు ఉన్నారని, దరఖాస్తు చేసుకున్న వారికి అవసరమైన సామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న 15 మందికి చెక్కకర్రలు, 10మందికి వినికిడి యంత్రాలు, 10మందికి ట్రైసైకిళ్లు, 12 మందికి వాకింగ్ స్టిక్స్, 15మందికి వీల్‌చైర్స్ అందజేసినట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ తెలిపారు.

క్లుప్తంగా

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య


సురేశ్‌ (ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): క్షణికావేశంలో యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కౌడిపల్లిలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైగరి బాలయ్య, విజయలకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు సురేశ్‌(18) ఏ పనీ చేయకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటాడు. సోమవారం కంచన్‌పల్లిలో బంధువుల విందు కార్యక్రమానికి వెళ్దామని అంతా సిద్ధమవుతున్నారు. కాగా, తన తల్లి వద్దకు వెళ్లి కొంత డబ్బులివ్వమని సురేశ్‌ అడగగా ఆమె లేవని చెప్పడంతో గొడవపడ్డాడు. కుటుంబసభ్యులు వేరే పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత కూడా ...

పటాన్‌చెరు టౌన్‌: మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌ మండలం జానకంపేటకు చెందిన అంజయ్య, శ్రావణి(25) భార్యాభర్తలు. వీరిద్దరూ కలిసి పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం భర్త అంజయ్య గేదెల మేపేందుకు వెళ్లగా మధ్యాహ్నం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న శ్రావణి తన ఇంట్లో సీలింగ్‌ ఫ్యాన్‌ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కూతురి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని మృతురాలి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్‌ఐ సోమేశ్వరి దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత గుట్కాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న షాపు నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్‌లో నివాసం ఉండే ప్రభాకర్‌ రామచంద్రాపురం.. కానుకుంటాలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కాగా నిషేధించిన గుట్కాలను అధిక మొత్తంలో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు.. దుకాణంపై దాడి చేసి నిషేధిత 472 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్‌ ఢీకొని బైకిస్టుకు తీవ్ర గాయాలు


గాయపడిన లక్ష్మయ్య

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్టీసీ బస్‌ ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గాగిల్లాపూర్‌ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. కోహెడ మండలం రాంచంద్రాపూర్‌కు చెందిన కల్లెపల్లి లక్ష్మయ్య బైక్‌పై గాగిల్లాపూర్‌ స్టేజీ వద్ద రాజీవ్‌ రహదారి దాటుతుండగా హైదరాబాద్‌ నుంచి జగిత్యాల వెళ్తున్న జగిత్యాల డిపో ఆర్టీసీ బస్‌ ఢీకొంది. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కాగా 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి అంబులెన్స్‌లో కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని శవం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నర్సాపూర్‌ రూరల్‌: గుర్తుతెలియని శవం లభ్యమైన సంఘటన మండలంలోని పెద్ద చింతకుంట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై పుష్ప రాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. వారు అక్కడికి వచ్చి పరిశీలించారు. వడదెబ్బ కారణంగా మృతిచెందాడని భావిస్తున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఎవరైనా మృతిచెందిన వ్యక్తి గురించి తెలిస్తే వెంటనే నర్సాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ కు 87126–57941. 8019657940 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

మేలైన విత్తనాలు రైతులకు కావాలి. తద్వారా పంట బాగా పండించి అధిక దిగుబడిని సాధించవచ్చు. చీడపీడల ప్రభావం ఉండదు. అయితే రైతుల కష్టనష్టాలను అర్థం చేసుకొని తోర్నాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారు శ్రమించిన దానికి తగిన ఫలితం దక్కింది. నేలల స్వభావానికి తగిన విధంగా ఉండే విత్తనాలను ఉత్పత్తి చేశారు.

మేలైన విత్తనం.. నాటుదాం



అందుబాటులోకి 5 వడ్ల రకాలు
- దండిగా రానున్న దిగుబడులు
- తోర్నాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం కృషి ఫలితం

సిద్దిపేటఅర్బన్‌: రైతుకు సరైన దిగుబడి రావాలంటే విత్తన ఎంపిక చాలా ముఖ్యం. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల కంపెనీలు పోటీ పడుతూ విక్రయిస్తున్నాయి. అందులో మేలైన.. నకిలీలు రైతు నిర్ధారించుకోవడం కష్టం. దుకాణాదారులు చెప్పిన మాయమాటలు నమ్మి కొనుగోలు చేస్తే సరైన దిగుబడి ఇస్తాయో? లేదో తెలియదు. దీనికి పరిష్కారంగా తోర్నాలలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు ఇక్కడి నేలల స్వభావానికి తగిన విధంగా ఉండే మేలైన రకాలను ఎంపిక చేసుకొని విత్తనాలను ఉత్పత్తి చేశారు. కావాల్సిన రైతులకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వరిలో దొడ్డు, సన్న రకాలకు చెందిన ఐదు వెరైటీలు, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇలా శాస్త్రవేత్తలు తమ పర్యవేక్షణలో పండించి, వివిధ రకాల పరీక్షించి నాణ్యతను నిర్ధారించారు. ఆవిత్తనాలు కొని సాగు చేస్తే దిగుబడిపై దిగులు పడాల్సిన అవసరం ఉండదు.

కంది (డబ్ల్యూఆర్‌జీఈ–97): వానాకాలానికి మాత్రమే అనుకూలమైన రకం. పంట కాలం 150–160 రోజులు. ఫ్యూజేరియం ఎండు తెగులును తట్టుకుంటుంది. ప్రతిలో అంతర పంటగా కూడా సాగు చేసుకోవడానికి అనుకూలమైన రకం. గింజలు ఎరుపు రంగులో ఉండి మధ్యస్తంగా లావు ఉంటాయి. 3 కిలోలు రూ. 450ల చొప్పున విక్రయిస్తున్నారు.

- **వరి(దొడ్డు రకం) జేజీఎల్‌–24423:** ఇది వానాకాలం, యాసంగి సాగుకు అనుకూలమైన రకం. పంట కాలం 125 రోజులు కాగా ఎకరాకు 30–35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఆరుతడి విధానంలో, వెద సాగు పద్ధతిలో సాగు చేసుకోవడానికి అనుకూలమైన రకం. సుడి దోమ, చలి, చౌడును కొంత వరకు తట్టుకుంటుంది. 20 కిలోల సంచి ధర రూ.1,100
- **వరి (కేఎస్‌ఎం–118, దొడ్డు రకం):** వానాకాలం, యాసంగి సాగుకు అనుకూలమైన రకం. పంట కాలం 125 రోజులు. గింజలు రాలే లక్షణం తక్కువగా ఉంటుంది. దిగుబడి ఎకరాకు 28–32 క్వింటాళ్లు వస్తుంది. 25 కిలోల సంచి ధర రూ. 1,100
- **వరి(కేఎస్‌ఎం–1638 సన్న రకం):** వానాకాలం, యాసంగి సాగుకు అనుకూలమైన రకం. పంట కాలం 120–135 రోజులు. గింజ నాణ్యతగా వస్తుంది. అన్నం వండుకున్న తర్వాత పొడి పొడిగా ఉంటుంది. ఉల్లికోడు (బయోటైపు–1, 2, 4) ను తట్టుకుంటుంది. దిగుబడి ఎకరాకు 28–32 క్వింటాళ్లు. 20 కిలోల సంచి ధర రూ. 960
- **వరి(డబ్ల్యూజీఎల్‌–44, సన్నరకం):** వానాకాలంలో సాగు చేసుకోవడానికి అనుకూలమైన రకం. పంట కాలం 145 రోజులు. అన్నం నాణ్యతగా ఉంటుంది. ఉల్లికోడు (బయోటైపు–1)ని సమర్థవంతంగా తట్టుకుంటుంది. దిగుబడి ఎకరాకు 24–30 క్వింటాళ్లు. 20 కిలోల సంచి ధర రూ. 960

మూడేళ్లుగా విత్తన మేళా నిర్వహిస్తున్నాం

పరిశోధనా కేంద్రం వద్ద మూడు సంవత్సరాలుగా విత్తన మేళా నిర్వహిస్తున్నాం. రైతుల నుంచి స్పందన బాగా వస్తోంది. మొదటి సంవత్సరం నిర్వహించినప్పుడు 50 మంది వరకు రైతులు వచ్చారు. ప్రస్తుతం సుమారు 400 మంది రైతులు వచ్చారు. విత్తనాలు ఎప్పటికీ అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. రైతులు నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్‌ ఎస్‌. శ్రీదేవి,ప్రధాన శాస్త్రవేత్త


విత్తన మేళాలో అందుబాటులో ఉంచిన వరి విత్తనాల సంచులు

- **వరి (డబ్ల్యూజీఎల్‌–962, సన్నరకం):** వానాకాలం, యాసంగి సాగుకు అనుకూలమైన రకం. పంట కాలం 125–135 రోజులు. అన్నం నాణ్యత బాగుంటుంది. అగ్గి తెగులు, మొగి పురుగు ఉధృతిని కొంత వరకు తట్టుకుంటుంది. ఎకరాకు 26–30 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. 20 కిలోల సంచి ధర రూ. 960

యువకుడి దారుణ హత్య

- భూ సరిహద్దు వివాదంపై ఘర్షణ
- కత్తులు, గొడ్డళ్లతో దాడి
- మరో ఇద్దరికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- చాంద్‌ఖాన్‌పల్లిలో ఉదంతం


మృతుడు అంకం అశోక్‌ (ఫైల్‌)

నారాయణఖేడ్‌: సరిహద్దు వివాద భూముల్లో చెట్ల నరికివేతపై నిలదీసిన వర్గంపై మరో వర్గం వారు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఇద్దరికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.ఈ ఘటన నారాయణఖేడ్‌ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. నారాయణఖేడ్‌ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంకం లక్ష్మయ్య, మల్లయ్య, పక్కనున్న స్కూల్‌ తండాకు చెందిన దేవీసింగ్‌కు చెందిన భూములు పక్కపక్కనే ఉన్నాయి. కొన్నేళ్లుగా సరిహద్దుల వివాదాలు ఉండగా కోర్టులో సివిల్‌ కేసు నడుస్తుంది. ఆభూముల్లో మల్లయ్య, దేవీసింగ్‌ కుటుంబీకులు చెట్లు నరికారు. లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేస్తే నరికిన చెట్లను అక్కడే వదిలేశారు. సోమవారం ఉదయం ఆ చెట్లను తీసుకెళ్లేందుకు కుటుంబీకులతో కలిసి మల్లయ్య, దేవీసింగ్‌లు వచ్చారు. విషయం తెలుసుకుని అంకం లక్ష్మయ్య, ఆయన సోదరుడు అంకం రాములు, లక్ష్మయ్య కుమారుడు అంకం అశోక్‌ ప్రశ్నించడానికి ఇక్కడికి వచ్చారు. దీంతో మల్లయ్య, అతడి సోదరుడు జ్ఞానేశ్వర్‌తోపాటు మలయ్య సోదరుడి కుమారులు, దేవీసింగ్‌తోపాటు అతడి కుమారులతోపాటు మరికొందరు గొడ్డళ్లు, కత్తులు, కర్రలతో ఒక్కసారిగా దాడికి దిగారు. ఈ ఘటనలో అంకం అశోక్‌(40), అంకం రాములు (68), అంకం లక్ష్మయ్య (65)లు గాయపడ్డారు. వారిని నారాయణఖేడ్‌ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అశోక్‌ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కత్తిపోట్లతో తీవ్రగాయాలపాలైన రాములును మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడ్డ లక్ష్మయ్య ఖేడ్‌ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఖేడ్‌, కంగ్టి సీఐలు, డివిజన్‌ పరిధిలోని ఎస్సైలు, సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఎన్నోసార్లు ఫిర్యాదు చేశా : మృతుడి తండ్రి లక్ష్మయ్య

వివాదంలో ఉన్న భూమిపై కోర్టు ఇంజక్షన్‌ ఆర్డర్‌ ఉన్నా నిందితులు చెట్లు నరుకుతున్నారని నాలుగు మార్లు ఖేడ్‌ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని ఎస్సై విద్యాచరణ్‌ రెడ్డి కాళ్లు మొక్కినా కనికరించలేదని మృతుడి తండ్రి అంకం లక్ష్మయ్య ఆరోపించారు. ఆభూమిలోకి ఎవ్వరూ వెళ్లవద్దని నిందితులకు పోలీసులు చెబితే ఇంత దారుణం జరిగేది కాదని, తన కొడుకు ప్రాణం నిలిచేదని రోదించాడు. ఈ ఘటనకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమన్నాడు.

సూపర్‌ మార్కెట్‌లో చోరీ

రూ. 5.53 లక్షల నగదు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఏసీపీ మధు

నంగునూరు(సిద్దిపేట): సూపర్‌ మార్కెట్‌లో దొంగలు పడి సొత్తు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి నంగునూరులో చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలోని ఓ సూపర్‌ మార్కెట్‌ వెనుకభాగంలో ఉన్న రేకులను తొలగించి షాపులో చొరబడ్డారు. కౌంటర్‌ నగదుతో పాటు బీరువాలో ఉన్న రూ 5.53 లక్షలను దోచుకెళ్లారు. సూపర్‌వైజర్‌ గుడికాడి మహేందర్‌ సోమవారం ఉదయం షాపు తెరవగా దొంగతనం జరిగినట్లు గుర్తించి యజమాని నరేశ్‌తోపాటు రాజగోపాల్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ మధు, రూరల్‌ సీఐ శ్రీను, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, క్లూస్‌ టీం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- 21 మందిపై దాడి
- తెల్లపూర్‌లో ఘటన


గాయపడిన చిన్నారి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పిచ్చి కుక్క కాటుకు 21 మంది గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో వెలుగుచూసింది. ఆదివారం రాత్రి తెల్లాపూర్‌కు చెందిన వృద్ధుడు లక్ష్మయ్య రోడ్డుపై నిలబడి తన స్నేహితులతో మాట్లాడుతున్నాడు వెనుక నుంచి వచ్చిన కరిచి వెళ్లిపోయింది. ఆరోజు రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు 21 మందిని కరిచింది. కుక్కకాటుకు గురైన వారిలో చిన్నారులను, వృద్ధులను, మహిళలు ఉన్నారు. గ్రామానికి చెందిన వాట్సాప్‌ గ్రూప్‌లో పిచ్చికుక్క కరుస్తుంది జాగ్రత్త అంటూ పోస్టులు కూడా వెలుగు చూశాయి. ఈ విషయాన్ని అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం అయిన అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకొని ఉంటే బాధితుల సంఖ్య అంతకు పెరిగి ఉండేది కాదని పేర్కొంటున్నారు. పలువురు బాధితులు పెంటయ్య, జ్యోతి, లక్ష్మమ్మ, సుస్మిత మాట్లాడుతూ ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల బెడద తప్పడం లేదన్నారు. తమ ఇళ్ల ఎదుట నిలబడిన సమయంలో కుక్క వచ్చి కరచిందన్నారు.

మొక్కల పంపిణీకి సిద్ధం చేయాలి

గజ్వేల్‌రూరల్‌: వర్షాకాలంలో నాటేందుకు మొక్కలను పంపిణీకి సిద్ధం చేయాలని గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ నర్సయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రహదారులు, ఇంటి ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్‌ ఏఈ శ్రీధర్‌ తదితరులున్నారు.

భారీ అగ్నిప్రమాదం

- గడ్డపోతారంలోని హెటిరో పరిశ్రమలో ఎగిసిపడిన మంటలు
- భయాందోళనలో కార్మికులు, ప్రజలు


ప్రమాదంలో వెలువడుతున్న దట్టమైన పొగలు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హెటిరో పరిశ్రమలో గల కెమికల్స్‌ రికవరీ ప్లాంట్‌లో పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగలు ఎగిసిపడటంతో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు, సమీప గ్రామాల ప్రజలు, పారిశ్రామల యాజమాన్యాలు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ప్లాంట్‌లో భారీ డ్రమ్ములతో పాటు పెద్ద కంటెయినర్లలో రసాయనాలను నిల్వ ఉంచుతారు. ఇక్కడ నిత్యం వందల సంఖ్యలో కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. షార్ట్‌ సర్క్యూట్‌ కారణమో లేదా రసాయనాల మధ్య చర్య వల్లనో భారీ మంటలు ఎగిసి పడ్డాయి. కెమికల్స్‌ డ్రమ్ములు ఎగిరిపడ్డాయి. భారీ మంటలు, దట్టమైన పొగలతో పారిశ్రామిక వాడలో చీకటి కమ్ముకుంది. అప్పటికే కార్మికులు అప్రమత్తమై అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దాలతో రసాయన డ్రమ్ములు ఎగిరి పడుతుండటంతో సమీపంలోని కార్మికులు, గ్రామాల ప్రజలు అక్కడి నుంచి పరుగులు తీశారు. జీడిమెట్ల, నర్సాపూర్‌, పటాన్‌చెరు, పాశమైలారంల నుంచి పది వరకు ఫైర్‌ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు రసాయన బాల్స్‌ను యాజమాన్యం వినియోగించింది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగిందని యాజమాన్యం తెలిపింది. బొల్లారం సీఐ గంగాధర్‌ ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి నుంచి కార్మికులు, ప్రజలను ఇళ్లకు పంపించారు. సమీపంలోని అరబిందో, మైలాన్‌ తదితర పరిశ్రమల యాజమాన్యాలు కూడా మంటలను ఆర్పేందుకు వారి వంతు సహకారాన్ని అందించారు. మంటలు అదుపులోకి రావటం, విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఎలాంటి ప్రాణ హానీ జరగకపోవటంతో యాజమాన్యం, అధికారులు, పోలీసులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎలాంటి ప్రాణహాని జరగలేదు

ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఆస్తినష్టం విషయమై అంచనా వేస్తాం. ప్రమాదం జరిగిన విషయాన్ని ప్రభుత్వ అధికారులకు తెలియజేశాం. ప్రమాదం ఎలా జరిగిందనే విషయమై విచారణ చేపడతాం.

– రవిబాబు, పరిశ్రమ ప్రతినిధి


మంటలను ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

తాళం కోసం వెళ్లి.. అనంతలోకాలకు..

ప్రమాదవశాత్తు ధాన్యం కుప్పను ఢీకొని యువకుడి మృతి


నవీన్‌(ఫైల్‌)

మర్కూక్‌(గజ్వేల్‌): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీ కొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎర్రవల్లిలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌ఖాన్‌పల్లికి చెందిన జంగిటి నవీన్‌ (28) బైక్‌ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఎర్రవల్లిలో మెకానిక్‌ షాపు పెట్టుకున్నాడు. రోజూ సొంతూరు నుంచి ఇక్కడికి వెళ్లి వచ్చేవాడు. శనివారం సాయంత్రం షాపు నుంచి ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత షాపు వద్ద తాళం చెవి వదిలి వచ్చానని వెళ్లి తీసుకొస్తానని బైక్‌పై బయలుదేరాడు. ఎర్రవల్లి వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ప్రమాదవశాత్తు వాహనం ఢీ కొనడంతో కింద పడిపోడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తోటి వాహనదారులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఇక్కడికి చేరుకొని గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌.. గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. సోదరుడు శ్రీకాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య స్వప్న, కుమారుడు, కూతురు ఉన్నారు.

బొలేరో రూపంలో కబళించిన మృత్యువు

సిద్దిపేటకమాన్‌: బొలేరో వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్‌ సీఐ ఉపేందర్‌, ఎస్‌ఐ రాజేశం తెలిపిన వివరాల ప్రకారం.. కేసీఆర్‌ నగర్‌ కాలనీలోని డబుల్‌ బెడ్రూం ఇళ్లలో వడ్లకొండ తిరుపతి (37) తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను దుబ్బాకలోని ఓ పేపర్‌ప్లేట్లు తయారు చేసే కంపెనీలో కూలీ. ఆదివారం రాత్రి తన ఇంటి ఎదుట బైక్‌పై కూర్చుని ఉన్న సమయంలో మద్యంమత్తులో ఉన్న ఓ వ్యక్తి బొలేరో వాహనంతో ఢీకొట్టాడు. దీంతో గాయాలైన అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. తిరుపతి భార్య భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేశం తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం.

విందు కోసం వచ్చి..


విజయ్‌ (ఫైల్‌)

అల్లాదుర్గం(మెదక్‌): విందుకు కోసం వచ్చి తిరుగు ప్రయాణంలో 161 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడం వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గడిపెద్దాపూర్‌ గ్రామ శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పుల్కల్‌ మండలం పెద్దరెడ్డిపేటకు చెందిన మంగలి విజయ్‌కుమార్‌(22) అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లికి మేనత్త ఇంటికి విందుకు వచ్చాడు. శుభకార్యం తర్వాత మద్యం తాగి బావమరిదితో గొడవ పడ్డారు. అదే రాత్రి పెద్దరెడ్డిపేటకు బైక్‌పై విజయ్‌కుమార్‌ వెళ్తుతుండగా గడిపెద్దాపూర్‌ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. విజయ్‌కుమార్‌కు వికారాబాద్‌ జిల్లా బీరెల్లికి చెందిన ప్రవళికతో 25 రోజుల క్రితం పెళ్లయింది. అప్పాజీపల్లిలో బంధువుల ఇంటికి భార్య ప్రవళికతో కలిసి అతను బైక్‌పై విందుకొచ్చాడు. కాగా తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంబారిన పడి మృతి చెందాడన్న వార్త తెలియడంతో ఊరిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్‌ ఢీకొని వ్యక్తి..

రామాయంపేట(మెదక్‌): వ్యక్తిని బైక్‌ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని అక్కన్నపేట వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాగి సాయిలు (65) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఝాన్సిలింగాపూర్‌కు చెందిన చాకలి ఎల్లం వేగంగా బైక్‌పై వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో సాయిలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సను వైద్యులు అందించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఏసవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రంజిత్‌ తెలిపారు.

ఇటుకబట్టీపై నుంచి పడి..


ప్రధాన్‌ మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): ఇటుక బట్టీపై పని చేస్తూ ఓ కార్మికుడు కింద పడి గాయాలై మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూర మండలం కొత్తగూడెం గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్‌ కథనం ప్రకారం.. గ్రామ శివారులో భానోత్‌ రాజు ఇటుక బట్టీల వద్ద ఒడిశా రాష్ట్రం అనుగుల్‌ జిల్లాకు చెందిన పంజాబీ ప్రధాన్‌(45), భార్య కొడుకు కూతురుతో కలిసి కొంతకాలంగా కార్మికులుగా పని చేస్తున్నారు. ఈనెల 25న రాత్రి ఒక్కసారిగా వర్షం కురియడంతో ఏడుగురు కార్మికులు బట్టీపైకి ఎక్కి టార్పాలిన్‌ కప్పుతుండగా ప్రధాన్‌ ఇక్కడి నుంచి కింద పడి మెడకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో యజమాని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న ప్రధాన్‌ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్నానానికి వెళ్లి ఒకరు.. ముఖం కడుక్కునేందుకు వెళ్లి మరొకరు..


వేణు బాబు(ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): స్నానం కోసం వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన ఏడుపాయల్లోని చెక్‌ డ్యాం వద్ద సోమవారం వెలుగు చూసింది. ఎస్సై నరేష్‌ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన చేరాల వేణు బాబు(30) ఆదివారం తన బంధువులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. స్నానం కోసం చెక్‌ డ్యాంలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి పోయాడు. పక్కనున్న వారు రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. నీటి ఉధృతికి కొట్టుకొని గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఇక్కడికి చేరుకున్నారు. ఈతగాళ్ల సహాయంతో రాత్రింతా గాలించారు. మృతదేహం లభించకపోవడంతో సోమవారం ఉదయం తిరిగి గాలించారు. వేణుబాబు డేడ్‌బాడీని స్వాధీనం చేసుకున్నారు. సోదరుడు కృష్ణప్రసాద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- ప్రమాదవశాత్తు ఏడుపాయల చెక్‌ డ్యాంలో మరో వ్యక్తి పడి మృతిచెందాడు.

ఎస్సై నరేష్‌ కథనం మేరకు.. పెద్దశంకరంపేటకు చెందిన రజినీకుమార్‌ (19) ఆది వారం కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ దర్శనం కోసం ఏడు పాయలకు వచ్చాడు. సోమవారం ఉదయం ముఖం కడుక్కునేందుకు చెక్‌ డ్యాం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చెక్‌ డ్యాంలో గాలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరంచారు.